రాబడి



ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

1 సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్‌ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2 పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడుల కుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3 ఫిక్స్‌డ్ డిపాజిట్లు

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4 సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.

5 నేషనల్ పెన్షన్ సిస్టమ్

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6 సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.

7 ట్యాక్స్ ఫ్రీ బాండ్లు

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8 ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్‌ఎస్‌ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9 మ్యూచువల్ ఫండ్స్

మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10 పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.



దత్త మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు

దత్తాత్రేయ మందిరంలో భక్తుల పూజలు

బచ్చన్నపేట, సెప్టెంబర్ 1 : మండలంలోని కొడవటూరు సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని దత్త మందిరంలో ఆదివారం భక్తుల పూజలు చేశారు. అర్చకుడు ముకేశ్‌శర్మ మహాలింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో అర్యకులు రామచంద్రమూర్తి, భక్తులు కొత్తపల్లి రాజయ్య, మల్లికార్జున్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణుడి పల్లకి ఊరేగింపు

బచ్చన్నపేట, సెప్టెంబర్ 1: మండలంలోని రామచంద్రపురం గ్రామంలో హిందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహంతో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనగామ కమిటీ సభ్యులు కొన్నే ఉపేందర్- నాగలక్ష్మి, భువనగిరి కమిటీ అధ్యక్షుడు దేవేందర్ జనగామ, భువనగిరి, చేర్యాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

జఫర్‌గఢ్, సెప్టెంబర్ 1 : మండలంలోని తీగారానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ఉద్దమారి ప్రభాకర్(45) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభాకర్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో నిద్రిస్తున్న క్రమంలో గుండెపోటు రాగా, బాధితుడిని దవాఖానకు తరలిస్తుండగానే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

తొర్రూరు, సెప్టెంబర్ 1: యువతి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని వెలికట్టలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొమ్ము శ్రీనివాస్-సుగణ దంపతుల కుమార్తె సౌమ్య హైదరాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నది. నల్లగొండ జిల్లా చౌటుప్పల్ మండలం అలంపుర్‌కి చెందిన రియల్ ఎస్టేట్ నిర్వాహకుడు జిన్నమోని యాదగిరి సౌమ్యను ప్రేమిస్తున్నానని కొన్ని నెలలుగా వేధిస్తున్నాడు. రెండు రోజుల క్రితం స్వగ్రామం వచ్చిన యువతికి మళ్లీ యాదగిరి ఫోన్ చేయడంతో మనస్తాపానికి గురై శనివారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యు లు దవాఖానకు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందింది.

రెవెన్యూ అధికారి బెదిరింపులు ..!

కొత్తగూడ, సెప్టెంబర్ 1: కొత్తగూడ మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌ను ఏసీబీ అంటూ బెదిరించి రూ. 5 లక్షలు డిమాండ్ చేసి, రూ.35 వేలు ఫోన్‌పే చేయించుకున్న ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత తహసీల్దార్ రమాదేవితో మాట్లాడుతూ ఫోన్‌లో కాన్ఫరెన్స్ కాల్‌కు ఆర్ఐ పరమేశ్‌ను లైన్‌లోకి తీసుకొని రూ. 5లక్షల డిమాండ్ చేసి బురిడీ కొట్టించినట్లు తెలిసింది. తన ఫోన్‌పేలో రూ.35 వేలే ఉన్నాయని చెప్పడంతో వారు ఫోన్‌పే చేయమని అన్నారు. ఆర్ఐ రూ.35 వేలు ఫోన్‌ఫే చేశారు. ఈ నంబర్‌లు నకిలీవని తేలడంతో ఠాణాలో ఫిర్యాదు చేశాడు.

రాఘవాపూర్‌లో అలుగు పోస్తున్న ఊర చెరువు

కొత్తపల్లి వాగు వద్ద సూచనలిస్తున్న సీఐ వేణు

తిమ్మంపేట శివారులో మత్తడిని పరిశీలించిన రోహిత్ సింగ్

పొంగిపొర్లిన వాగులు, వంకలు

- మత్తడి దుంకుతున్న చెరువులు, కుంటలు
- 'మల్లన్నగండి' గేట్లు ఎత్తిన అధికారులు
- వరదలను పర్యవేక్షించిన అదనపు కలెక్టర్

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాలతో వరదలు పోటెత్తాయి. దీంతో మండలంలోని వాగులు పొంగిపొర్లుతుండడంతో ఆదివారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ గ్రామాలను సందర్శించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎస్సీ కాలనీలో వర్షపు నీరు ఇంట్లోకి చేరడంతో వృద్ధుడు అంగడి ఉప్పలయ్యను బయటకు తీసుకొచ్చారు. అతడిని వృద్ధాశ్రమంలో చేర్పించాలని పింకేశ్‌కుమార్ అధికారులను కోరారు. కొత్తపల్లి, తాటికొండ గ్రామాల మధ్య మేలొర్రె పారుతుండడంతో వెనక్కి వచ్చారు. కొత్తపల్లి కల్వర్టును, రాఘవాపూర్‌లో హైవేపై కల్వర్టును సీఐ వేణు పరిశీలించారు. ఇప్పగూడెంలో బొంకూరి విమలకు చెందిన ఇంటి గోడ కూలిపోవడంతో రూ.10 వేల ఆస్తి నష్టం జరిగింది. రాఘవాపూర్ ఊర చెరువు, తాటికొండ వల్లభరాయుని చెరువు, కొచ్చెరువు, ఊర కుంట అలుగు పోస్తున్నాయి. తాటికొండ, కృష్ణాజిగూడెం మధ్యగల వాగు బ్రిడ్జిని తాకేలా నీరు ప్రవహిస్తుంది. మల్లన్నగండి రిజర్వాయర్‌లోకి భారీగా వరదలు రావడంతో గేట్లు ఎత్తారు. రాఘవాపూర్ శివారులోని రైల్వే ట్రాక్ పైకి వర్షపు నీరు చేరింది. వరద ప్రాంతాలను తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి ఎంపీడీవో సదానందం, ఆర్ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శి ఏదునూరి సత్యం పరిశీలించారు.

ఉప్పుగల్లులో మత్తడి పోస్తున్న రిజర్వాయర్

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండలంలోని తిమ్మంపేట శివారులో బోళ్ల మత్తడి వరదను అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ పరిశీలించారు. వరదను మళ్లించాలని అధికారులకు సూచించారు. ఉప్పుగల్లు రిజర్వాయర్ మత్తడి పోస్తుండగా, ఆకేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఉప్పుగల్లు, కూనూరు, తిడుగులోని చెక్ డ్యాములు అలుగు పోస్తున్నాయి. సూరారం, సాగరం, తమ్మడపల్లి(జీ), తిమ్మంపేట గ్రామాల్లోని ఊర చెరువులు నిండి మత్తడి దుంకుతున్నాయి. తమ్మడపల్లి(జీ)- పాలకుర్తి రూట్‌లో మంజూరైన బీటీ రోడ్డు వర్షాలకు కొట్టుకు పోయింది. జఫర్‌గఢ్ శివారులోని నల్లబండ క్రాస్ వద్ద కల్వర్టుపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో డీటీ హరిప్రసాద్, పోలీసులు పరిశీలించి రాకపోకలను నియంత్రించారు. తమ్మడపల్లి(జీ), సాగరం గ్రామాల్లో వరి పంట నీటి మునిగాయి. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శంకరయ్య, ఎస్సై రామ్ చరణ్ కోరారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని గార్లతండా శివారులోని మల్లన్నగండి రిజర్వాయర్ నిండడంతో అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. తహసీల్దార్ సరస్వతి, ఆర్ఐ శ్రీనివాస్, ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ వరదలను పర్యవేక్షించారు. కృష్ణాజిగూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు. చిల్పూరు చెరువు మత్తడి నీరు రహదారిపైకి రావడంతో అధికారులు ట్రాక్టర్‌ను అడ్డం పెట్టి రాకపోకలను నిలిపి వేశారు. నష్కల్ రిజర్వాయర్ అలుగుపోస్తుడడంతో సాగునీటికి ఢోకా ఉండదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్‌లో వృద్ధుడిని బయటకు తీసుకవస్తున్న జీపీ సిబ్బంది



మల్లన్నగండి గేట్ల నుంచి వస్తున్న నీరు

రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మత్తడి పడుతున్న నష్కల్ రిజర్వాయర్

దివ్యాంగుల ఉపకరణాలకు

లబ్ధిదారుల ఎంపిక

4 నుంచి 6వ వరకు ప్రత్యేక శిబిరాలు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 1 : జిల్లా సంక్షేమశాఖ-ఆలింకో సంయుక్తంగా ఈ నెల 4, 5, 6 తేదీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగుల సహాయ ఉకపకరణాల లబ్ధిదారుల ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నట్లు సంక్షేమ అధికారి జయంతి తెలిపారు. ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల రిక్షా, వీల్ చైర్, సంక కర్రలు, చేతి కర్రలు, హియరింగ్ ఎడ్స్, స్మార్ట్ కేన్ డివైజెస్, టీఎల్ఎం కిట్స్, 4జీ స్మార్ట్ ఫోన్లు అందజేస్తామన్నారు. ఈ నెల 4న పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు చెందిన దివ్యాంగులకు పాలకుర్తి రైతు వేదికలో శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 5న స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూరు, రఘునాథపల్లి మండలాల వారికి స్టేషన్‌ఘన్‌పూర్ రైతువేదికలో, 6న కలెక్టరేట్‌లో జనగామ అర్బన్, రూరల్, లింగాల ఘనపూర్, నర్మెట, తరిగొప్పుల, బచ్చన్నపేట మండలాల దివ్యాంగులకు శిబిరం ఉంటుందని తెలిపారు.

పాత పెన్షన్ విధానం

అమలు చేయాలి : టీజీఈ జేఏసీ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 1: ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీజీఈ జేఏసీ చైర్మన్ వడ్డెబోయిన శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మార్వో సెంటర్‌లో పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ, యూటీఎఫ్ నాయకులు మల్లారెడ్డి, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో..

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం డోర్నకల్ టీఎస్ యూటీఎఫ్ సభ్యులు ఖమ్మం, మహబూబాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు తుమ్మ వెంకటప్పయ్య, మండల కార్యదర్శి శివప్రసాద్, సీతారాములు, దేవేందర్, రజిని, రాములు పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, లేకపోతే ఉద్యమిస్తామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ప్రధాన కర్యాదర్శి శ్రీకాంత్‌నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ, టీఎస్ జెఏసీ ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. రవీందర్, చిక్కులాల్, చిరంజీవి, రామారావు, రాంబాబు, పూర్ణచందర్, రాందాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

రాళ్లవాగులో డీసీఎం వ్యాన్ గల్లంతు

- వ్యాన్‌లో ఐదుగురు వ్యక్తులు
- వారిలో ఒకరి గల్లంతు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబర్ 1 : మహబూబాబాద్ మండల శివారులోని ఈదులపూసపల్లి రోడ్డులో ఉన్న రాళ్లవాగులో డీసీఎం వ్యాన్ ఆదివారం రాత్రి గల్లంతయింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రాంతానికి చెందిన ఓ డీసీఎం వాన్ ఈదులపూసపల్లి మీదుగా మానుకోటకు వస్తున్నది. ఈ క్రమంలో రాళ్లవాగు ఉధృతంగా ప్రవహించటం రెండు గంటలపాటుగా వేచి చూశారు. వరద ఉధృతి తగ్గినట్లు భావించి వాగు దాటుతున్న క్రమంలో డీసీఎం వ్యాన్ కొట్టుకుపోయి వాగులో ఒకచోట ఆగింది. అందులో ఉన్న ఐదుగురు వ్యక్తులో ముగ్గురు వ్యాన్‌ను, మిగతా ఇద్దరు చెట్లను పట్టుకొని ఉన్నారు. ఈ క్రమంలో అక్కడి చేరుకున్న రెస్క్యూ టీం వారిని కాపాడడానికి తాళ్లు వేయగా, ఒక్కరు పట్టుకుని వస్తు న్న క్రమంలోనే జారిపోయి గల్లంత

వీరభద్రస్వామికి హైకోర్టు జడ్జి పూజలు

కురవి, సెప్టెంబర్ 1: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని ఆదివారం హైదరాబాద్ హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద దర్శించుకున్నారు. ఆలయ ఈవో సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. జడ్జి గోత్రానామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వయంభు అమ్మవారి దర్శనం అనంతరం ముఖమండపంలో పూజారులు ఆశీర్వచనం తెలిపి తీర్థప్రసాదాలు అందజేశారు. జడ్జి వెంట సీనియర్ సివిల్ జడ్జి మహబూబాబాద్ సురేశ్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ క్రాంతికుమార్, సూపరింటెండెట్ అమరేందర్ ఉన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని హైకోర్టు జడ్జి సురేపల్లి నంద అన్నారు. జిల్లా కోర్టులో సత్య లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించగా ముఖ్య అతిథిగా జడ్జి హాజరయ్యారు.